సాక్షి

డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

సోమవారం । 6 । జనవరి । 2025



వెండి తీర్థం గిన్నె అందజేత

నిడదవోలు రూరల్: తిమ్మరాజుపాలెంలో వేంచేసి యున్న కోటసత్తెమ్మ అమ్మవారికి ఇరదల సత్యరాజ్‌కుమార్, ఝాన్సీరాణి దంపతులు (రాజమహేంద్రవరం) 375 గ్రాముల వెండి తీర్థం గిన్నె అందజేశారు.




ఐక్యతే మన బలం

ఐక్యతే మన బలం.. ఇదే ఉత్సాహంతో ముందుకు సాగుదామంటూ యూటీఎఫ్ స్వర్ణోత్సవ వేడుకల్లో వక్తలు పిలుపునిచ్చారు.

8లో

డెల్టాలకు నీటి విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు ఆదివారం 12,810 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 3,780, మధ్య డెల్టాకు 2,460, పశ్చిమ డెల్టాకు 6,570 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

వలంటీర్ల జీవితాలతో ఆటలాడొద్దు

జిల్లా అసోసియేషన్ చైర్మన్ సత్తిబాబు



వలంటీర్ల సేవలపై ఓ ఇంటి వద్ద చైతన్య పరుస్తున్న జిల్లా అసోసియేషన్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: వలంటీర్లకు అటు పెండింగ్ గౌరవ వేతనాలు ఇవ్వకుండా, ఉద్యోగాలను గాలిలో పెట్టి కూటమి ప్రభుత్వం ఆటలాడుతుందని జిల్లా వలంటీర్ల అసోసియేషన్ చైర్మన్ కె.సత్తిబాబు ఆరోపించారు. జిల్లా అసోసియేషన్ కో కన్వీనర్ ఆనంద్ ఆధ్వర్యంలో అమలాపురంలో ఆదివారం జరిగిన చైతన్య యాత్ర ఉద్యమ దీక్ష కార్యక్రమంలో సత్తిబాబు ప్రసంగించారు. గ్రామ, వార్డు సచివాలయాలను కొనసాగిస్తున్న కూటమి ప్రభుత్వం వలంటీర్లకు పని చూపకుండా నిర్లక్ష్యం చేస్తోందని సత్తిబాబు అన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో వలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తామని, తాము అధికారంలోకి వస్తే వారి పారితోషికం రెట్టింపు చేస్తామని కూటమి పార్టీల ముఖ్య నేతలు హామీల వర్షం కురిపించి నేడు మరచిపోయారని ఆరోపించారు. అసోసియేషన్ జిల్లా కో కన్వీనర్ ఆనంద్ మాట్లాడుతూ వలంటీర్లనే కాదు నిరుద్యోగ భృతి ఇస్తామన్న హామీని కూడా కూటమి ప్రభుత్వం మరచిపోయిందని ధ్వజమెత్తారు. జిల్లా అసోసియేషన్ ప్రతినిధులతో కలసి వలంటీర్లు పలు ఇళ్లకు వెళ్లి అక్కడి ప్రజలకు తమ సేవలను గుర్తు చేశారు. సూర్యనగర్, సీతాపతిరావుపేట ప్రాంతాల్లో వీరి చైతన్య యాత్ర ఉద్యమ దీక్ష కార్యక్రమం సాగింది.

సమస్యల పరిష్కారంలో మీనమేషాలు



సమావేశంలో మాట్లాడుతున్న సాయి శ్రీనివాస్

అమలాపురం రూరల్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడుస్తున్నా రాష్ట్రంలోని 11 లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన సమస్యల పరిష్కారంలో మీనమేషాలు లెక్కిస్తోందని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు లంకలపల్లి సాయి శ్రీనివాస్ ధ్వజమెత్తారు. అమలాపురంలోని అంబేడ్కర్ భవన్‌లో ఎస్టీయూ జిల్లా వార్షిక కౌన్సిల్ సమావేశాన్ని జిల్లా అధ్యక్షుడు పోతంశెట్టి దొరబాబు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథి సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ, 12వ పీఆర్సీ నియమించి పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా 30 శాతం మధ్యంతర భృతి వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. సీపీఎస్, జీపీఎస్‌లను రద్దు చేసి, పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని, పెండింగ్‌లో ఉన్న రూ.25 వేల కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సరిదే సత్య పళ్లంరాజు, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, ఎస్టీయూ ఆర్థిక కార్యదర్శి నేరేడిమిల్లి సత్యనారాయణ, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు నాగిరెడ్డి శివప్రసాద్, ఉపాధ్యక్షుడు చొప్పల రాంబాబు, సీపీఐ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

అమలాపురంలో సినీ హీరో శ్రీకాంత్



అమలాపురంలో తన స్నేహితుడిని పరామర్శిస్తున్న సినీ హీరో శ్రీకాంత్

అమలాపురం టౌన్: స్థానిక మైపాల వీధిలోని జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు యెనుముల కృష్ణ పద్మరాజు ఇంటికి సినీ హీరో శ్రీకాంత్ ఆదివారం వచ్చారు. కృష్ణ పద్మరాజు బావ మరిది యాళ్ల సీతారామ కృష్ణమూర్తి హైదరాబాద్‌లో వ్యాపార రీత్యా స్థిరపడ్డారు. అక్కడ హీరో శ్రీకాంత్, సీతారామ కృష్ణమూర్తి స్నేహితులు. అమలాపురానికి చెందిన సీతారామ కృష్ణమూర్తి తల్లి భానుమతి ఇటీవల మృతి చెందారు. మాతృ వియోగంతో బాధపడుతున్న ఆయన్ని పరామర్శించేందుకు హీరో శ్రీకాంత్ అమలాపురం వచ్చారు.

నేడు యథావిధిగా గ్రీవెన్స్

అమలాపురం రూరల్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) సోమవారం ఉదయం 10 గంటల నుంచి జరగనుంది. అమలాపురంలోని జిల్లా కలెక్టరేట్ గోదావరి భవన్‌లో ఈ కార్యక్రమం నిర్వహిస్తామని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అర్జీదారులు తమ సమస్యలను జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకువచ్చి పరిష్కార మార్గాలు పొందాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా స్థాయితోపాటు డివిజన్, మండల స్థాయిలోనూ గ్రీవెన్స్ జరుగుతుందన్నారు.

దివ్యాంగులపై దోబూచిలాట

- పింఛన్ల తొలగింపునకు సర్వే అస్త్రం
- కొత్త వాటికి అతీగతి లేదు
- నేటి నుంచి పింఛన్ల వడబోత



అల్లవరం మండలం గోడిలో దివ్యాంగుల సర్వేలో పాల్గొన్న డీఆర్‌డీఏ పీడీ శివశంకరప్రసాద్ (ఫైల్)



గోడిలో దివ్యాంగుల వివరాలను తనిఖీ చేస్తున్న అధికారుల బృందం (ఫైల్)

అలమూరు: పింఛనుదారులకు పెద్ద కష్టం వచ్చింది.. కూటమి ప్రభుత్వాన్ని గద్దెనెక్కించడంతో వారికి అవస్థలు తెచ్చిపెడుతోంది.. పేదలు, దివ్యాంగుల పింఛన్లపై రాష్ట్ర ప్రభుత్వం దోబూచులాడుతోంది. అధికారంలోకి వచ్చిన వెంటనే ఏ విధమైన నిబంధనలు లేకుండా అర్హులతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళలకు 50 ఏళ్లకే పింఛన్లు మంజూరు చేస్తామని ఇచ్చిన హామీని అటకెక్కించింది. కొత్త సంవత్సరంలోనైనా పింఛన్లను మంజూరు చేస్తారనుకునే లోపే ఇప్పుడు కొత్తగా సర్వే అస్త్రం వదిలింది. ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి గత నవంబర్ నెలాఖరు వరకూ భర్త మృతి చెందితే స్పౌజ్ కింద భార్యకు పింఛన్ బదలాయింపు జరగలేదు. పింఛన్‌ను పొందుతున్న భర్త మృతి చెందితే నిబంధనలకు అనుగుణంగా 15 రోజుల వ్యవధిలో భార్యకు పింఛన్ అందించాలి. ఇప్పటి వరకూ కూటమి ప్రభుత్వం ఆ పింఛన్లను మంజూరు చేయకపోవడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. అయితే డిసెంబర్ నెలలో తూతూమంత్రంగా స్పౌజ్ పథకం కింద భర్త చనిపోతే భార్యకు పింఛన్‌ను మంజూరు చేసింది. అధికార పగ్గాలు చేపట్టిన ఆరు నెలల కాలంలో కొత్త పింఛన్‌ను మంజూరు చేయకపోగా, అనర్హుల పేరిట దివ్యాంగుల పింఛన్లలో కోత విధించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈ నెల 6 నుంచి దివ్యాంగుల పింఛన్ల తనిఖీ పేరిట కోతకు సిద్ధపడుతోంది. జిల్లాలోని 22 మండలాలు, మూడు మున్సిపాలిటీలు, ఒక నగర పంచాయతీ పరిధిలో 2,16,990 మంది వివిధ పింఛన్‌దారులు ఉన్నారు. వీరిలో కొంతమందిని తొలగించేందుకు సర్వం సిద్ధం చేస్తోంది.

అంతటా ఆందోళన

జిల్లాలో దివ్యాంగ పింఛన్ల తొలగింపుపై సోమవారం నుంచి సర్వే జరుగుతుందని అధికారులు ప్రచారం చేయడంతో అర్హుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. ఈ ఏడాది ఆగస్టులో జరిగిన దివ్యాంగుల పింఛన్ల తనిఖీలో జిల్లా వ్యాప్తంగా 189 మందిని అనర్హులుగా గుర్తించారు. అందులో భాగంగానే దివ్యాంగుల పింఛన్లపై సమగ్ర సర్వే చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది, రాష్ట్ర ప్రభుత్వం పింఛన్ల భారాన్ని తగ్గించుకునేందుకు గత డిసెంబర్ 9, 10 తేదీల్లో రెండో విడత సర్వే చేపట్టింది. ప్రజల నుంచి వ్యతిరేకత రాకుండా మండలంలోని ఒక గ్రామాన్ని ప్రయోగాత్మకంగా ఎంపిక చేసుకుంది. జిల్లాలో అల్లవరం మండలం గోడిలో గత నెలలో ప్రయోగాత్మకంగా దివ్యాంగ పింఛన్లపై రీసర్వే చేసింది. గ్రామసభ ఏర్పాటు చేసి సర్వేలో రూపొందించిన నివేదిక ఆధారంగా వివరాలను సేకరించి పింఛన్‌ను తొలగించే ప్రక్రియకు నాంది పలికింది. అదే క్రమంలో జిల్లా వ్యాప్తంగా ఇదే పద్ధతిని అనుసరించేందుకు ప్రభుత్వం సిద్ధపడుతోంది.

నలుగురు సభ్యులతో బృందంగా..

దివ్యాంగ పింఛన్లను సమగ్రంగా తనిఖీ చేసేందుకు వీలుగా ఆర్థోపెడిక్, జనరల్ వైద్యులతో పాటు గ్రామ సచివాలయ ఉద్యోగి, గ్రామ పంచాయతీ అధికారులతో కూడిన నలుగురు సభ్యుల బృందం గ్రామాల్లో పర్యటించనుంది. తొలుత దివ్యాంగ పింఛన్ల లబ్ధిదారుల ఇంటికి వెళ్లి తనిఖీలు నిర్వహించి వికలాంగ అర్హతపై వివరాలు సేకరిస్తుంది. జిల్లాలో మంచానికే పరిమితమైన 493 మంది దివ్యాంగులకు ఈ నెల ఆరు నుంచి 15 రోజుల పాటు అర్హత పరీక్షలు నిర్వహించనుంది. ఈ పరీక్షల్లో అనర్హులని తేలితే సాధారణ దివ్యాంగులకు ఇచ్చే రూ.ఆరు వేల పింఛన్లలో చేరుస్తారు. అలాగే రెండో విడతలో సాధారణ దివ్యాంగుల పింఛన్లను తనిఖీ చేస్తారు. ఈ తనిఖీల్లో అనర్హులు అని తేలితే వికలాంగ పింఛన్‌ను రద్దు చేయడంతో పాటు ధ్రువపత్రాన్ని మంజూరు చేసిన వైద్యాధికారిపై చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది.

అప్పట్లో చేరికలు.. నేడు తొలగింపులు

పేదల అభ్యున్నతే ధ్యేయంగా కుల మతాలకతీతంగా పాలన సాగించిన గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఒక పింఛన్ కూడా తొలగించలేదు. ఏటా క్రమం తప్పకుండా జనవరి, జూలై నెలల్లో కొత్త పింఛన్లను మంజూరు చేసేది. గత ఏడాది జనవరిలో జిల్లా వ్యాప్తంగా అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో 7,489 పింఛన్లను మంజూరు చేశారు. అలాగే అప్పటి నుంచి జూన్ వరకూ (కూటమి సర్కారు వచ్చేనాటికి) గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా పింఛన్ల మంజూరు కోసం ఆన్‌లైన్‌లో 8,467 మంది దరఖాస్తు చేసుకున్నారు. వైఎస్సార్ సీపీ మళ్లీ అధికారం చేపట్టి ఉంటే ఇప్పటికే ఉన్న పింఛన్లలో ఒక్కటి కూడా తొలగించకుండా ఉండే వారనే అభిప్రాయం దివ్యాంగుల నుంచి వ్యక్తమవుతోంది. అలాగే ఏటా జనవరి, జూలై నెలలో కచ్చితంగా అర్హులందరికీ పింఛన్లు మంజూరయ్యే పరిస్థితి ఉండేదని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

జిల్లాలో పింఛనుదారులు	
వృద్ధాప్య పింఛన్లు	1,29,297
వితంతువులు	49.906
దివ్యాంగులు	32,681
ఒంటరి మహిళలు	4,557
డయాలసిస్, పెరాలసిస్ (రూ.15 వేలు పొందే రోగులు)	493

దశల వారీగా నిర్ణయం?

రాష్ట్ర ప్రభుత్వ వైఖరి చూస్తుంటే అనర్హుల పేరిట పింఛన్లను దశల వారీగా తొలగిస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. తొలి విడతలో రూ.15 వేలు పొంది మంచానికే పరిమితమైన రోగులను సర్వే చేసి జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే కొంతమందిని అనర్హుల జాబితాలో చేర్చారు. ఆ జాబితాలో ఉన్న మిగిలిన 493 మందికి ఈ నెల 20 లోపు పరీక్షలు నిర్వహించి వికలాంగత్వాన్ని నిర్ధారిస్తారు. అలాగే మలి విడతలో రూ.ఆరు వేల పింఛను పొందుతున్న దివ్యాంగులపై సర్వే జరిపి అనర్హులను చేసే విధంగా సర్వే జరుగుతోందని అంతా అనుకుంటున్నారు. భవిష్యత్‌లో వృద్ధ, వితంతు, కళాకారులు, కల్లుగీత కార్మికులు, ఒంటరి మహిళల పింఛన్లు తొలగించే ప్రయత్నం చేస్తారేమోనని ప్రజలు భయపడుతున్నారు. అలాగే కొన్ని గ్రామాల్లో వైఎస్సార్ సీపీ సానుభూతి పరుల పింఛన్లను రద్దు చేసే యోచనలో అధికార పార్టీ నేతలు ఉన్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే జిల్లాలో వేలాది పింఛన్లు వివిధ కారణాలతో తొలగించినా ఇంకా కొత్త పింఛన్లు మంజూరు కాకపోవడంతో ప్రభుత్వంపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారు.

అర్హులను గుర్తించేందుకే సర్వే



రాష్ట్ర ప్రభుత్వం అర్హులందరికీ సక్రమంగా పింఛన్లను అందించేందుకు సర్వే చేపట్టింది. తొలి విడతలో జిల్లా వ్యాప్తంగా మంచానికి పరిమితమై రూ.15 వేలు పొందుతున్న దివ్యాంగులపై సర్వే జరుగుతుంది. అనంతరం మిగతా దివ్యాంగుల పింఛన్ల తనిఖీ కొనసాగుతుంది. దివ్యాంగుల పింఛన్లు నకిలీవని తేలితే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. జిల్లాలోని ప్రతి గ్రామంలో గుర్తించిన ప్రతి దివ్యాంగుడి నివాసానికి నలుగురు సభ్యుల బృందం వెళ్లి క్షుణ్ణంగా పరీక్షలు చేస్తోంది. -కె.దుర్గారావుదొర, డీఎంహెచ్‌ఓ

అయినవిల్లికి పోటెత్తిన భక్తులు



అయినవిల్లిలో విఘ్నేశ్వర స్వామిని పల్లకిలో ఊరేగిస్తున్న భక్తులు

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వర స్వామివారి ఆలయం ఆదివారం భక్తులతో పోటెత్తింది. ఉదయం ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో స్వామివారికి మేలుకొలుపు సేవ, పంచామృతాభిషేకం, ఏకాదశ, లఘున్యాస రుద్రాభిషేకాలు, వివిధ ప్రత్యేక పూజలు చేశారు. మహానివేదన అనంతరం వివిధ పుష్పాలతో స్వామిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. స్వామివారి లఘున్యాస, ఏకాదశ రుద్రాభిషేకాల్లో 28 మంది, లక్ష్మీ గణపతి హోమంలో 12 మంది భక్త దంపతులు పాల్గొన్నారు. ముగ్గురు చిన్నారులకు నామకరణ, అక్షరాభ్యాసాలు, తులాభారం వంటివి నిర్వహించారు. 23 మంది నూతన వాహన పూజ చేయించుకున్నారు. స్వామివారి అన్నదాన పథకంలో 1,600 మంది అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ పూజలు, అన్నదాన విరాళాలుగా రూ.2,82,085 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళాలు



దాత దేవీభవాని, పవన్‌కుమార్ దంపతులకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ అర్చకులు

అయినవిల్లి విఘ్నేశ్వర స్వామివారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన బళ్ల దేవీభవాని, పవన్‌కుమార్ దంపతులు రూ. 1,63,810, ఈదరపల్లికి చెందిన దొడ్డ సాయిరామ్, హిమమాలిని రూ.10 వేలు, కాకినాడకు చెందిన బీఎస్ సూర్యకళ రూ.10,116 అందజేశారు. ఈ సొమ్మును ఆలయ అర్చకులు వినాయకరావు, సత్తిబాబుకు అందజేశారు. దాతలను వేదమంత్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం ఇచ్చారు.

నేతి చమురు వదిలిపోతోంది

- తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి వివాదం ఫలితం
- అన్ని దేవస్థానాల్లో టెండర్ ద్వారా ఆవు నెయ్యి కొనుగోలుకు ప్రభుత్వం బ్రేక్
- విధాన నిర్ణయం తీసుకునే వరకూ సహకార డెయిరీల నుంచి కొనాలని ఆదేశం
- సర్కారు నిర్ణయంతో సత్యదేవుని ప్రసాదం తయారీ మరింత ప్రియం
- ఇప్పటికే సుమారు రూ.67 లక్షల భారం

అన్నవరం: ఎంకి పెళ్లి సుబ్బి చావుకొచ్చిందని సామెత. సరిగ్గా ఇదే విధంగా తిరుమల లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగించారనే ఆరోపణలతో రాష్ట్రంలోని అన్ని దేవస్థానాల్లోనూ టెండర్ ద్వారా నెయ్యి కొనుగోలును ప్రభుత్వం నిలిపివేసింది. దీనిపై పూర్తి స్థాయిలో విధానపరమైన నిర్ణయం తీసుకునేంత వరకూ సహకార డెయిరీల నుంచి నెయ్యి కొనుగోలు చేయాలని ఆదేశించింది. సర్కారు తీసుకున్న ఈ నిర్ణయం అన్నవరం దేవస్థానంపై అదనపు భారం మోపుతోంది. సత్యదేవుని ప్రసాదంలో ఉపయోగించే ఆవు నెయ్యిని టెండర్ ద్వారా కాకుండా ప్రభుత్వ ఆదేశాల ప్రకారం సహకార డెయిరీల నుంచి అధిక రేటుకు కొనుగోలు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. ఫలితంగా తాజా లోయెస్ట్ టెండర్ రేటుతో పోల్చి చూస్తే గత మూడు నెలల్లో దేవస్థానం నెయ్యి కొనుగోలుకు రూ.67 లక్షలు పైగా వెచ్చించాల్సి వచ్చింది.



చాలా కాలం నుంచి అన్నవరం దేవస్థానం అవసరాలకు ఆవు నెయ్యిని టెండర్ ద్వారానే కొనుగోలు చేస్తున్నారు. ఎప్పుడూ నెయ్యి నాణ్యతపై ఇక్కడ ఎటువంటి వివాదమూ తలెత్తలేదు. అయినప్పటికీ ప్రభుత్వం టెండర్ ద్వారా నెయ్యి కొనవద్దని ఆదేశించడంతో దేవస్థానానికి 'నేతి' చమురు వదిలిపోతోంది.

ఇదీ గత విధానం

అన్నవరం దేవస్థానంలో ప్రసాదం తయారీకి ఏటా సుమారు 2 లక్షల కిలోల నెయ్యి ఉపయోగిస్తున్నారు. ప్రతి నెలా సుమారు 12 వేల కేజీల నుంచి 20 వేల కేజీల వరకూ వినియోగిస్తారు. ఆరు నెలలకోసారి టెండర్ పిలిచి నెయ్యి కొనుగోలు చేస్తుంటారు. దీనికోసం దేవస్థానం ఏటా రూ.6 కోట్ల నుంచి రూ.10 కోట్ల వరకూ ఖర్చు చేస్తోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో లోయెస్ట్ టెండర్ ఖరారయ్యాక మళ్లీ రివర్స్ టెండర్ ద్వారా ఎవరు తక్కువకు ఇస్తే వారి నుంచే కొనుగోలు చేసే విధానాన్ని ప్రవేశపెట్టారు. దీని ప్రకారం రైతు డెయిరీ సంస్థ టెండర్ ద్వారా 2022 నుంచి రెండేళ్ల పాటు కేజీ ఆవు నెయ్యిని రూ.564కే సరఫరా చేసింది. ఆ టెండర్ కాలపరిమితి ముగియడంతో గత ఏడాది అక్టోబర్ 1 నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకూ ఆవు నెయ్యి సరఫరాకు ఈ–ప్రొక్యూర్‌మెంట్ టెండర్ పిలిచారు. తరువాత రివర్స్ టెండర్ ద్వారా తిరుపతికి చెందిన వినాయక ఏజెన్సీ కిలో నెయ్యి రూ.484కు, విశాఖ డెయిరీ కిలో రూ.488కి సరఫరా చేయడానికి కొటేషన్లు దాఖలు చేశాయి. ఎల్–1గా ఉన్న వినాయక ఏజెన్సీకి టెండర్ దక్కింది. అయితే తిరుమల లడ్డూ తయారీకి సరఫరా చేస్తున్న నెయ్యి కల్తీ అయిందనే ఆరోపణలతో నెయ్యి కొనుగోళ్లను రాష్ట్ర ప్రభుత్వం నిలిపివేసి, సహకార డెయిరీల నుంచి కొనుగోలు చేయాలని ఆదేశించింది.

చమురు వదులుతోందిలా..

- రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గత ఏడాది అక్టోబర్ 10 నుంచి నవంబర్ 10వ తేదీ వరకూ విజయవాడలోని విజయా డెయిరీ నుంచి 15 టన్నుల ఆవునెయ్యిని కేజీ రూ.640 చొప్పున కొనుగోలు చేశారు. గతంలో రైతు డెయిరీ సరఫరా చేసిన ఆవు నెయ్యి కిలో రూ.564. ఇది గతంలో రైతు డెయిరీ రేటు కంటే రూ.76 ఎక్కువ. దీని ప్రకారం 15 టన్నులకు అన్నవరం దేవస్థానం రూ.12.40 లక్షలు అధికంగా చెల్లించినట్లు తెలుస్తోంది. అలాగే, తాజా లోయెస్ట్ టెండర్ రేటు రూ.484తో పోలిస్తే కేజీకి రూ.156 ఎక్కువ. దీని ప్రకారం 15 టన్నులకు రూ.23.40 లక్షలు అదనంగా వదిలిపోయింది.
- నవంబర్ పదో తేదీ నుంచి సంగం డెయిరీ ఆవు నెయ్యి కేజీ రూ.595కి కొనుగోలు చేస్తున్నారు. రైతు డెయిరీ నెయ్యి కేజీ ధర రూ.564తో పోలిస్తే సంగం ధర రూ.31 అధికం. సంగం డెయిరీ నుంచి ఇప్పటి వరకూ 40 టన్నులు కొనుగోలు చేయగా కేజీకి అదనంగా రూ.31 చొప్పున రూ.12.4 లక్షలు అధికంగా చెల్లించాల్సి వచ్చింది. అదే తాజా టెండర్ రేటు కేజీ రూ.484తో పోలిస్తే కేజీకి రూ.111 ఎక్కువ. దీని ప్రకారం ఏకంగా రూ.44.40 లక్షలు అధికంగా చెల్లించినట్లయ్యింది.
- గత ఏడాది ఆగస్టులో పిలిచిన లోయెస్ట్ టెండర్‌దారు వినాయక ఏజెన్సీ నుంచి ఆవు నెయ్యి కొనుగోలు చేస్తే దేవస్థానానికి రూ.67.80 లక్షలు ఆదా అయ్యేది. లేదా రైతు డెయిరీ నుంచి కొనుగోలు చేసినా సుమారు రూ.25 లక్షలు ఆదా అయ్యేది.
- నెయ్యి కొనుగోలుకు ఈ విధంగా చెల్లిస్తున్న ధర టెండర్ రేటుకంటే అధికంగానే ఉందని అధికారులు కూడా చెబుతున్నారు. సహకార డెయిరీల ద్వారా టెండర్లు ఆహ్వానించినా.. ఇప్పుడు కొనుగోలు చేసిన దాని కన్నా తక్కువ రేటుకే దేవస్థానానికి ఆవునెయ్యి లభించేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



ప్రసాదంలో నెయ్యి కలుపుతున్న సిబ్బంది

నాణ్యమైనదని తేలితేనే..

దేవస్థానానికి సరఫరా చేసిన నెయ్యి నాణ్యత విషయంలో గతంలో ఎప్పుడూ ఎటువంటి వివాదమూ లేదు. ప్రభుత్వ నియమ నిబంధనలను అనుసరించి టెండర్‌దారు నాణ్యమైన నెయ్యి సరఫరా చేయాలి. ఆ మేరకు ల్యాబ్ సర్టిఫికెట్లు జత చేస్తారు. అయినప్పటికీ దేవస్థానం కూడా విజయవాడలోని ల్యాబ్‌కు శాంపిల్స్ పంపించి మళ్లీ పరీక్షలు చేయిస్తుంది. నాణ్యమైన నెయ్యి అని తేలితేనే దానిని ప్రసాదంలో ఉపయోగిస్తామని అధికారులు చెప్పారు.

అభయారణ్యంలో పక్షుల గణన



పక్షుల గణన చేపట్టిన బృంద సభ్యులతో అటవీ శాఖ అధికారులు





కోరింగ అభయారణ్యంలో కెమెరాకు చిక్కిన పక్షి సమూహం

తాళ్లరేవు: అభయారణ్యంలో పక్షులను లెక్కించేందుకు ప్రత్యేక బృందం శ్రమించింది. ప్రత్యేక కెమెరాలతో కోరింగ అభయారణ్యం, సముద్ర తీర ప్రాంతంలో అణువణువూ జల్లెడ పట్టింది. ఏషియన్ వాటర్ బర్డ్ సెన్సస్– 2025లో భాగంగా ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చిన 12 బృందాలు ఇందులో పాలుపంచుకున్నాయి. పర్యావరణంలోని ప్రస్తుత పరిస్థితులను తెలుసుకోవడంతో పాటు, దూర ప్రాంతాల నుంచి వచ్చే వలస పక్షుల సంఖ్యను లెక్కించేందుకు ప్రభుత్వం ఏటా ఈ గణన చేపడుతోంది. దీనికోసం ఫారెస్ట్ రేంజ్ అధికారి ఎస్ఎస్ఆర్ వరప్రసాద్ నేతృత్వంలో సుమారు 60 మందితో కూడిన బృందానికి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. లెక్కింపులో అటవీ సిబ్బందితోపాటు ఒక వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్, ఒక సైంటిస్ట్, ఒక స్టూడెంట్‌తో పాటు ఒక వలంటీర్ పాల్గొన్నారు. ఆదివారం తెల్లవారుజామున మూడు గంటల నుంచి ప్రత్యేక కెమెరాలతో కోరంగి మడ అటవీ ప్రాంతం, సముద్ర తీర ప్రాంతంలో సంచరించే వివిధ రకాల పక్షులు, దూర ప్రాంతాల నుంచి వలస వచ్చే పక్షులను గుర్తించారు. నేషనల్ బయోడైవర్సిటీ అథారిటీ, ఏపీ స్టేట్ కో ఆర్డినేటర్ శ్రీరామ్‌రెడ్డి, సీనియర్ సైంటిస్ట్, బీఎన్‌హెచ్‌ఎస్ ప్రతినిధి ఎస్.శివకుమార్, రీసెర్చ్ సైంటిస్ట్ డి.మహేష్‌బాబు నేతృత్వంలో ఈ కార్యక్రమం జరిగింది. దీనిని ఫారెస్ట్ రేంజర్ ఎస్ఎస్ఆర్ వరప్రసాద్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ సిద్ధార్థ తదితరులు పర్యవేక్షించారు. కోరంగి బయోడైవర్సిటీ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో పక్షి గణనలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ వరప్రసాద్ సర్టిఫికెట్లను అందజేశారు. అన్నీ పరిశీలించిన తరువాత పక్షుల సంఖ్యను ప్రకటించనున్నట్లు వరప్రసాద్ వివరించారు. వైల్డ్ లైఫ్ కన్జర్వేషన్ ఆఫ్ ఇండియా ప్రతినిధి డాక్టర్ ఈశ్వర్ సత్యనారాయణ, ఎఫ్ఎస్ఓలు, అటవీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో 'సాక్షి' సబ్ ఎడిటర్‌కు తీవ్ర గాయాలు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): నగరంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో 'సాక్షి' దినపత్రికలో సబ్ ఎడిటర్‌గా పని చేస్తున్న జ్యోతుల ప్రభాకరరావు తీవ్రంగా గాయపడ్డారు. ఆయన పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. వివరాలివీ.. మధ్యాహ్న సమయంలో పని నిమిత్తం బయటకు వెళ్లిన ప్రభాకరరావు తిరిగి లాలా చెరువులోని తన నివాసానికి టూ వీలర్‌పై వెళ్తున్నారు. ఆల్ బ్యాంక్ కాలనీలోని నీరూస్ షోరూమ్ వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి మద్యం తాగి యాక్టివా వాహనంపై వస్తున్న బాలుడు అతి వేగంగా ప్రభాకరరావు వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ సంఘటనలో తలకు తీవ్ర గాయాలతో విపరీతంగా రక్తస్రావం అవుతున్న ప్రభాకరరావును కుటుంబ సభ్యులు హుటాహుటిన బొల్లినేని ఆసుపత్రికి తరలించారు. ఆయనకు వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ప్రభాకరరావు వెంటనే కోలుకోవాలని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి ఎం.శ్రీరామమూర్తి ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రమాద విషయం తెలిసిన వెంటనే రాజమండ్రి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కుడుపూడి పార్థసారథి, సాక్షి స్టాఫ్ రిపోర్టర్ షేక్ ఫయాజ్ బాషా, సాక్షి రాజమహేంద్రవరం బ్రాంచి మేనేజర్ రమేష్ రెడ్డి తదితరులు ఆసుపత్రికి చేరుకుని, కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు. ప్రకాశ్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

బస్సు ఢీకొని వ్యక్తి మృతి

కొత్తపల్లి: పిఠాపురంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వృద్ధుడు మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. పిఠాపురం పట్టణానికి చెందిన బాదం సూర్యనారాయణ (63) పెట్రోల్ బంకులో పని చేస్తున్నాడు. పని ముగించుకుని సైకిల్‌పై వెళ్తుండగా ప్రమాదవశాత్తు వెనుక నుంచి ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో సూర్యనారాయణ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	12,000 – 12,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	17,500
గటగట (వెయ్యి)	16,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	16,800
గటగట (వెయ్యి)	15,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	14,500 – 15,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	15,000 – 15,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

ఐక్యతే మన బలం



సభకు హాజరైన ఉపాధ్యాయులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఐవీ రావు



రాజ్యాంగ పీఠిక పుస్తకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీలు, యూటీఎఫ్ నాయకులు

- ఇదే ఉత్సాహంతో సాగుదాం
- యూటీఎఫ్ స్వర్ణోత్సవ వేడుకల్లో వక్తలు
- కాకినాడ పీఆర్ కళాశాలలో నిర్వహణ
- భారీగా హాజరైన ఉపాధ్యాయులు



ఉద్యమ గీతాలాపన చేస్తున్న యూటీఎఫ్ బృందం

కాకినాడ సిటీ: ఐక్యతే మన బలం.. ఇదే ఉత్సాహంతో ముందుకు సాగుదామంటూ యూటీఎఫ్ స్వర్ణోత్సవాల్లో వక్తలు పిలుపునిచ్చారు. ఆదివారం కాకినాడ పీఆర్ ప్రభుత్వ కళాశాలలో రాష్ట్ర యూటీఎఫ్ స్వర్ణోత్సవ వేడుకలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా యూటీఎఫ్ స్వర్ణోత్సవాల ఆహ్వాన సంఘ అధ్యక్షుడు, ఎన్టీఆర్ వైద్య విద్యాలయం మాజీ వైస్ చాన్సిలర్ డాక్టర్ ఐవీ రావు మాట్లాడుతూ నేటితరం విద్యార్థుల్లో క్రమశిక్షణ లోపిస్తుందని, దీనిని సరి చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, తల్లిదండ్రులపైనే ఉందని అన్నారు. ఇటువంటి విద్యా వైజ్ఞానిక సదస్సులు సమాజ ప్రగతికి ఎంతో దోహదం చేస్తాయన్నారు. పీడీఎఫ్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ నేటి పాలకుల ఉదాసీన వైఖరితో రాజ్యాంగ లక్షణాలు మరుగున పడుతున్నాయన్నారు. ప్రభుత్వ విధానాలతో ప్రభుత్వ రంగ విద్య నానాటికీ కుంటుపడుతోందని మరో ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు (ఐవీ రావు) అన్నారు. ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి మాట్లాడుతూ యూటీఎఫ్ తన పోరాటాల ద్వారా 50 ఏళ్లుగా ఎన్నో సమస్యలు పరిష్కరించిందన్నారు. సమసమాజ నిర్మాణం కోసం ఎప్పుడూ ముందుంటుందని అన్నారు. సభాధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా రంగాన్ని నిలబెట్టేందుకు యూటీఎఫ్ ప్రత్యేక ప్రణాళికలతో తీర్మానాలు చేయబోతుందన్నారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలంగా ఉంటేనే సమాజంలో ఫలాలు అందరికీ సమానంగా దక్కుతాయన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి దాన్ని ప్రగతి పథకంలో నడిపించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ మాట్లాడుతూ విద్యతోనే సమాజ అభివృద్ధి జరుగుతుందన్నారు. సమాజానికి గురువు ఎంతో గౌరవప్రదమైన వ్యక్తిని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ మాట్లాడుతూ తాను రాజకీయాల్లో రాకుండా ఉంటే ఉపాధ్యాయురాలిని అయ్యేదానినని పేర్కొన్నారు. ప్రపంచంలో అన్ని వృత్తులను తయారు చేసి అద్భుతమైన వృత్తి ఉపాధ్యాయ వృత్తి అన్నారు. అఖిల భారత ఉపాధ్యాయ సంఘ జాతీయ ప్రధాన కార్యదర్శి సీఎస్ భారతి మాట్లాడుతూ ప్రభుత్వాలు సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని, అప్పటి వరకూ దేశంలో ఉపాధ్యాయ ఉద్యమం ఆగదని ఉద్ఘాటించారు. తెలంగాణ రాష్ట్ర యూటీఎఫ్ అధ్యక్షుడు చావా రవి మాట్లాడుతూ గత పదేళ్లుగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రభుత్వ విద్యా వ్యవస్థ నిర్వీర్యం చేసిందన్నారు. తెలంగాణలో గత ప్రభుత్వం ఓడిపోవడానికి అక్కడ యూటీఎఫ్ ఒక కారణం అన్నారు.

గ్రామానికో మోడల్ స్కూల్ అవసరం

మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ కుంటుపడుతున్న ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించేందుకు ప్రభుత్వం తక్షణం గ్రామానికి ఒక మోడల్ స్కూల్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ఐదు తరగతులు, ఐదుగురు ఉపాధ్యాయులతో ఒక ఆదర్శ పాఠశాలను ఏర్పాటు చేస్తే పిల్లలకు చక్కటి విద్య అంది మంచి ఫలితాలు వస్తాయన్నారు. అనంతరం ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు భారత రాజ్యాంగంపై రాసిన నలుగు పుస్తకాలను సీఎస్ భారతి, ఇళ్ల వెంకటేశ్వరరావు, వి.బాలసుబ్రహ్మణ్యం తదితరులు ఆవిష్కరించారు. యూటీఎఫ్ సాంస్కృతిక కమిటీ ఆలపించిన పాటలు, నృత్య ప్రదర్శన అందరినీ అలరించాయి. ఈ సందర్భంగా పుస్తక ప్రదర్శన, బోధనోపకరణాల ప్రదర్శన అందరినీ ఆలోచింపజేశాయి. అనంతరం ప్రజా చైతన్య సదస్సు జరిగింది. సీపీఎం నాయకులు డి.రమాదేవి, జంగయ్య, కాకినాడ ఆర్జేడీ నాగమణి తదితరులు మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలలో ఎల్‌కేజీ, యూకేజీ లేకపోవడం వల్ల రోజురోజుకూ పిల్లల సంఖ్య తగ్గిపోతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఈ సదస్సులో ఒక సమాలోచన చేయాలని సూచించారు. సభలో యూటీఎఫ్ నాయకులు జోజయ్య, పి.బాబురెడ్డి, బొడ్డు నాగేశ్వరరావు, సురేష్‌కుమార్, కుసుమ కుమారి, కుమార్ రాజా, హనుమంతరావు, నాగమల్లేశ్వరరావు, కె.నగేష్, చక్రవర్తి, అన్నారాం, మనోహర్, జ్యోతిబసు, అరుణకుమారి, కిషోర్ కుమార్, ఐ.ప్రసాదరావు, సీహెచ్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం 16వ మహాసభల జాతాల జెండాలను ఆవిష్కరించారు. యూటీఎఫ్ పతాకాన్ని ఎస్టీఎఫ్ఐ జెండాని సీనియర్ నాయకులు కె.సత్తిరాజు, బీబీ రాఘవులు, జి.చిట్టిబాబు ఆవిష్కరించారు.

8, 9 తేదీల్లో ప్రపంచ తెలుగు మహాసభలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చైతన్యరాజు, వీసీ చంద్రశేఖరరెడ్డి, రామకృష్ణ

రాజానగరం: తెలుగు భాష సంస్కృతీ సాహిత్యాలను కాపాడుతూ, భావితరాలకు మాతృ భాషను సమృద్ధిగా అందించాలనే సంకల్పంతో ఈ నెల 8, 9 తేదీల్లో స్థానిక గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ)లో ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహించనున్నామని యూనివర్సిటీ చాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు) తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. గత ఏడాది జనవరిలో మూడు రోజులపాటు జరిగిన ప్రపంచ తెలుగు మహాసభలు ప్రాంగణంలోనే ఆదికవి నన్నయ, రాజరాజనరేంద్ర, కందుకూరి వీరేశలింగం పేరిట వేదికలను ఏర్పాటు చేసి, ఈ సభలను నిర్వహించనున్నామని అన్నారు. మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, సుప్రీంకోర్టు రిటైర్డ్ చీఫ్ జస్టిస్ ఎన్వీ రమణలతోపాటు పలువురు కేంద్రం మంత్రులు, రెండు తెలుగు రాష్ట్రాల నుంచి గవర్నర్లు, మంత్రులు, స్పీకర్లు, డిప్యూటీ స్పీకర్లు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సినీ నటులు, న్యాయకోవిదులు, భాషా పండితులు, రచయితలు హాజరవుతారన్నారు. వీసీ డాక్టర్ యు.చంద్రశేఖర్ మాట్లాడుతూ ఇందుకు సంబంధించిన కార్యక్రమాలు సోమవారం ఉదయం 6 గంటలకు గణపతి పూజతో ప్రారంభమవుతాయన్నారు. 7న అబ్బురపరిచే ఆవిష్కరణలు ఉంటాయన్నారు. సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు 560 మంది కవులచే కవితా గోష్ఠులు ఉంటాయన్నారు. ఈ ప్రాంగణంలో అయోధ్యలోని బాలరాముని ఆలయం నమూనాను సాంకేతిక పరిజ్ఞానంతో అందరినీ ఆకట్టుకునే రీతిలో నిర్మిస్తామన్నారు. ఈ సభలను విజయవంతం చేయడానికి 18 కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో సాహితీవేత్త యర్రాప్రగడ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గోదావరిలో గల్లంతై యువకుడి మృతి



వీరమణికంఠ (ఫైల్)

ముమ్మిడివరం: ఒక్కగానొక కుమారుడు.. అనుకోని ప్రమాదంలో మృతి చెందడంతో తమకు దిక్కెవరంటూ ఆ కుటుంబ సభ్యులు బోరున విలపించిన తీరు చూపరులను కంటతడి పెట్టించింది. ముమ్మిడివరం మండలం కొత్తలంక వృద్ధ గౌతమీ గోదావరి పాయలో మునిగి బీటెక్ విద్యార్థి మంగ విజయ వీర మణికంఠ గల్లంతు కాగా, అతని మృతదేహం ఆదివారం స్థానిక పుష్కర రేవులో లభ్యమైంది. వీరమణికంఠ ఇద్దరు స్నేహితులతో కలసి శుక్రవారం గోదావరి పాయ వద్దకు వెళ్లి స్నానం చేస్తుండగా గల్లంతైన విషయం తెలిసిందే. మృతుడి తల్లిదండ్రులు మంగ మహాలక్ష్మి, నాగేశ్వరరావు దంపతులు, కుటుంబ సభ్యులు ఆ యువకుడి మృతదేహాన్ని చూసి తల్లడిల్లిపోయారు. ఉన్నత చదువులు చదివి ప్రయోజకుడు అవుతాడనుకున్నామని, తన చెల్లులకు చేదోడుగా ఉంటాడని కలలు కన్నామని, ఇంతలో దేవుడు తమకు అన్యాయం చేశాడంటూ కన్నీరు మున్నీరుగా విలపించారు. మృతదేహానికి ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ మేరకు ఎస్సై డి.జ్వాలాసాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆవురా అనిపించాయి



అందాల పోటీలో ప్రథమ స్థానంలో నిలిచిన గిత్తతో శ్రీనివాసరావు (రామశింగవరం సర్పంచ్)



పోటీలకు తెలంగాణ నుంచి ప్రత్యేకంగా తీసుకువచ్చిన రూ.కోటి విలువ చేసే దున్న



ముద్దులొలికే పుంగనూరు దూడను ఎత్తుకున్న విద్యార్థిని



ఆల్ రౌండ్ ప్రతిభ కనబరిచిన గిర్ ఆవుతో బండ్రెడ్డి మణికంఠ సతీష్ (భీమవరం)



ఆవు పాల ఉత్పత్తిలో ప్రథమ బహుమతి అందుకుంటున్న మల్లిపూడి వెంకట్రావు (మండపేట)

- పాల ఉత్పత్తిలో మండపేట ప్రథమం
- ఆల్ రౌండర్ భీమవరం
- అందాల పోటీల్లో భీమవరం, పెదవేగి గిత్తలు ప్రథమం

మలికిపురం: కేశనపల్లిలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి ఆవు పాల ఉత్పత్తి, గిత్తల అందాల పోటీలు ఆదివారంతో ఘనంగా ముగిశాయి. రాష్ట్రం నలుమూలల నుంచీ 180 ఆవులు, గిత్తలు పాల్గొన్నాయి. మొత్తం 10 కేటగిరీల్లో విజేతలకు న్యాయ నిర్ణేతలు బహుమతులు అందజేశారు. ఒంగోలు ఆవు పాల ఉత్పత్తిలో మల్లిపూడి వెంకట్రావు (మండపేట) రెండు ఆవులు వరుసగా ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. వెంకట్రావుకు చెందిన ఒక ఆవు 16.246 కేజీలతో ప్రథమ, మరో ఆవు 14.906 కేజీల పాల ఉత్పత్తితో ద్వితీయ బహుమతులు పొందాయి. దీనికి గాను వరుసగా రూ.50 వేలు, రూ.30 వేలతో పాటు మెమెంటోలను ఆయన అందుకున్నారు. 14.766 కేజీల పాల ఉత్పత్తితో అడపా శ్రీనివాసరావు ఆవు మూడో స్థానంలో నిలిచింది. అలాగే అందాల పోటీల్లో బండ్రెడ్డి మణికంఠ సతీష్ (పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం)కు చెందిన ఆవులు, గిత్తలు ఆల్ రౌండ్ ప్రతిభ చూపాయి. సతీష్‌కు చెందిన గిర్ ఆవు ప్రథమ, పుంగనూరు ఆవుల అందాల పోటీల్లో ఆయనకే చెందిన ఆవు ప్రథమ స్థానం దక్కించుకున్నాయి. అలాగే పుంగనూరు, నాలుగు పళ్ల గిత్త, ఒంగోలు పాల పళ్ల గిత్తల విభాగాల్లో రెండు మూడు స్థానాల్లో నిలిచాయి. పుంగనూరు గిత్తల విభాగంలో మణికంఠ సతీష్ ప్రథమ, అడబాల ప్రేమ్‌కుమార్ (మాచవరం) ద్వితీయ స్థానాలు సాధించారు. గిర్ ఆవుల విభాగంలో రుద్రరాజు బుచ్చిరాజు (మలికిపురం మండలం లక్కవరం) ఆవు ద్వితీయ స్థానం పొందింది. పుంగనూరు పాల పళ్ల గిత్తల అందాల పోటీల్లో ఆలమూరు గోవిందు (కడియపులంక) గిత్త, పుంగనూరు నాలుగు పళ్ల గిత్తల విభాగంలో అడబాల ప్రేమ్‌కుమార్ ఆవు ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. ఒంగోలు పాలపళ్ల గిత్తల అందాల పోటీల్లో అడబాల ప్రేమ్‌కుమార్ ప్రథమ, నంబూరి నాగేశ్వరరావు (బాపట్ల) ద్వితీయ స్థానాల్లో నిలిచారు. పుంగనూరు పాల గిత్తల విభాగంలో గుండాబత్తుల మధు (పడమటిపాలెం) ప్రథమ, ఆలమూరు గోవిందు ద్వితీయ స్థానాలు సాధించారు. అందాల పోటీల ఒంగోలు విభాగంలో ఏలూరు జిల్లా పెదవేగి మండలం రామశింగరం సర్పంచ్ అడపా శ్రీనివాసరావుకు చెందిన ఒంగోలు గిత్త ప్రథమ, గుమ్మిలేరుకు చెందిన కుప్పాల విజయకుమార్ గిత్త ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. వివిధ విభాగాల్లో ఆవులు, గిత్తల రైతులకు మొత్తం రూ.6.50 లక్షల నగదు బహుమతులు, మెమెంటోలు అందించారు. విజేతలకు రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ నగదు, మెమెంటోలు ఇచ్చారు. రాష్ట్ర కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, మాజీ ఎమ్మెల్యేలు ఎంఏ వేమా, కొత్తపల్లి జానకీరామ్, నిర్వాహకుడు అడబాల లక్ష్మీనారాయణ, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెదకాపు, రాజోలు డీసీ పినిశెట్టి బుజ్జి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు అడబాల వీరబ్రహ్మాజీ పాల్గొన్నారు.

ఆటహాసంగా..

- రేపటి నుంచి 'కోనసీమ క్రీడోత్సవం..ఆటలతో ఆరోగ్యం'
- 7, 8, 9 తేదీల్లో మండల స్థాయి పోటీలు
- 22, 23, 24 తేదీల్లో జిల్లా స్థాయిలో నిర్వహణ




కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు (ఫైల్)

రాయవరం: విద్యార్థులకు ఆటపాటలతో పాటు క్రీడలూ ఎంతో అవసరం.. క్రీడా ప్రాంగణాల అభివృద్ధి, క్రీడాకారులకు అందించే ప్రోత్సాహంపై కోనసీమ కలెక్టర్ తరచూ ఆలోచన చేస్తుంటారు. సంక్రాంతి పర్వదినానికి పల్లెలన్నీ సిద్ధమవుతున్న వేళ.. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు క్రీడా పండగ నిర్వహించాలన్న కలెక్టర్ డాక్టర్ రావిరాల మహేష్‌కుమార్ ఆలోచనల నుంచి 'కోనసీమ క్రీడోత్సవం-ఆటలతో ఆరోగ్యం' క్రీడా పోటీల నిర్వహణకు బీజం పడింది. ఆయన ఆదేశాల నేపథ్యంలో క్రీడా పోటీల నిర్వహణకు జిల్లా విద్యాశాఖ, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ, ఇంజినీరింగ్ తదితర శాఖలు సంయుక్తంగా చర్యలు చేపట్టాయి. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభ్యాసం సాగిస్తున్న ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు క్రీడా పోటీలు రెండు విభాగాల్లో బాలురు, బాలికలకు వేర్వేరుగా ఈ పోటీలను నిర్వహిస్తున్నారు. మండల స్థాయిలో పోటీల నిర్వహణకు అవసరమైన చర్యలు తీసుకునేందుకు మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు సన్నద్ధమవుతున్నారు.

ఎలా నిర్వహిస్తారంటే..

ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు మండల స్థాయి పోటీలు నిర్వహించి, వీరికి బహుమతులు అందజేయనున్నారు. 4, 5, 6 తరగతుల విద్యార్థులకు కేవలం అథ్లెటిక్స్ పోటీలు మాత్రమే నిర్వహిస్తారు. ప్రాథమిక స్థాయి విద్యార్థులకు అథ్లెటిక్స్ పోటీలు మాత్రమే నిర్వహిస్తారు. 7, 8, 9 తరగతుల విద్యార్థులకు అథ్లెటిక్స్ పోటీలతో పాటు బ్యాడ్మింటన్, క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు జరుపనున్నారు. మండల స్థాయి పోటీలను మండల కేంద్రాల్లో.. జిల్లా స్థాయి పోటీలను అమలాపురంలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో నిర్వహించనున్నారు. మండల స్థాయిలో క్రీడా ప్రాంగణాలను ఆటలకు అనువుగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులకు ఇప్పటికే ఆదేశాలిచ్చారు. విద్యాశాఖాధికారులు ఈ పోటీలపై వైడ్ పబ్లిసిటీ ఇవ్వాల్సిందిగా జిల్లా కలెక్టర్ ఇచ్చిన ఆదేశాల్లో పేర్కొన్నారు. క్రీడా పోటీలకు హాజరయ్యే క్రీడాకారులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకునే విధంగా జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీం బాషా పర్యవేక్షణ చేస్తున్నారు. క్రీడా పోటీలకు అవసరమైన క్రీడా పరికరాల ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకున్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ పర్యవేక్షణలో కలెక్టర్ కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ అధికారి, డీఈఓ, డీఎస్‌డీఓ తదితర అధికారులు పర్యవేక్షిస్తున్నారు. ఈ పోటీల వద్ద సంబంధిత పీహెచ్‌సీ వైద్యాధికారులు వైద్య సదుపాయం ఏర్పాటు చేయాల్సి ఉంటుంది.

విజయవంతం చేయండి



ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించేందుకు జిల్లా స్థాయిలో కోనసీమ క్రీడోత్సవం-ఆటలతో ఆరోగ్యం కార్యక్రమానికి కలెక్టర్ శ్రీకారం చుట్టారు. ఈ పోటీలను విజయవంతం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎస్ఎంసీ చైర్మన్లు, మండల స్థాయి అధికారులు తగిన పర్యవేక్షణ చేయాలి.

– డాక్టర్ షేక్ సలీం బాషా, జిల్లా విద్యాశాఖాధికారి, కోనసీమ

ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నాం



ఈ పోటీలు పాఠశాల విద్యార్థులకు మాత్రమే నిర్వహిస్తున్నాం. ప్రైమరీ, హైస్కూల్ స్థాయిలో వారు పాల్గొననున్నారు. తొలిసారిగా జిల్లా కలెక్టర్ చొరవతో ప్రైమరీ విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్నాం. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ప్రస్తుతం నిర్వహించే క్రీడా పోటీలను విజయవంతం చేస్తాం.

– టి.సురేష్‌కుమార్, జిల్లా స్పోర్ట్స్ అభివృద్ధి సంస్థ అధికారి, కోనసీమ

మండల స్థాయి పోటీల నిర్వహణ ఇలా...

మండలం	పోటీలు నిర్వహించే స్థలం	కోఆర్డినేటర్
అయినవిల్లి	జెడ్పీహెచ్ఎస్, ముక్తేశ్వరం	ఎంజీ రామారావు
ఆలమూరు	జీహెచ్ఎస్, కొత్తూరు	డి.సత్తిబాబు
అల్లవరం	జెడ్పీహెచ్ఎస్, కొమరగిరిపట్నం	ఎం.రాము
అమలాపురం	జెడ్పీహెచ్ఎస్ (బాలురు)	కె.గణేష్
అంబాజీపేట	జెడ్పీహెచ్ఎస్, అంబాజీపేట	ఏహెచ్ఏస్ సూర్యనారాయణ
ఆత్రేయపురం	ఎంజీఆర్ జూనియర్ కాలేజ్	పి.శ్రీనివాస్
ఐ.పోలవరం	జెడ్పీహెచ్ఎస్, జి.వేమవరం	ఐ.విజయ
కె.గంగవరం	జెడ్పీహెచ్ఎస్, పామర్రు	ఏవీవీ సత్యనారాయణ
కపిలేశ్వరపురం	జెడ్పీహెచ్ఎస్, కపిలేశ్వరపురం	జి.వేణుగోపాలరావు
కాట్రేనికోన	జెడ్పీహెచ్ఎస్, కాట్రేనికోన	ఎం.కమల
కొత్తపేట	జీహెచ్ఎస్, కొత్తపేట	వై.ఉషారాణి
మలికిపురం	జెడ్పీహెచ్ఎస్, బట్టేలంక	కె.నాగరాజు
మామిడికుదురు	జెడ్పీహెచ్ఎస్, మామిడికుదురు	ఎం.శ్రీధర్
మండపేట	జీహెచ్ఎస్, మండపేట	ఎస్.వీర్రాజు
ముమ్మిడివరం	జెడ్పీహెచ్ఎస్(బాలురు)	ఎస్.రాంబాబు, ముమ్మిడివరం
పి.గన్నవరం	జెడ్పీహెచ్ఎస్‌పి.గన్నవరం	కె.వెంకటరమణ
రామచంద్రపురం	ఎస్‌కేపీజీఎస్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల	కె.శ్రీనివాస్
రావులపాలెం	జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల	కె.లక్ష్మిప్రసన్న, రావులపాలెం
రాయవరం	జెడ్పీహెచ్ఎస్, రాయవరం	ఎ.కృష్ణప్రసాద్
రాజోలు	జెడ్పీహెచ్ఎస్ (బాలురు),	పి.రామకృష్ణ
సఖినేటిపల్లి	జెడ్పీహెచ్ఎస్, మోరి	కె.కృష్ణప్రసాద్
ఉప్పలగుప్తం	జెడ్పీహెచ్ఎస్, భీమనపల్లి	కె.మధు